

# భూత "గోస్టు" కథ

## "నేను సుబ్బారావుని"

రావికొండలరావు

ఊరంతా మంచి నిద్రలో వుంది.

రెండో ఆట సినిమాలు కూడా అయిపోడంతో, నరసంచారం తగ్గిపోయింది. వీధుల్లో దీపాలు మినుకు మినుకు మంటున్నాయి. అక్కడా అక్కడా పడుకొని వున్న కుక్కలు, ఏదైనా చడి అయితే తలెత్తి చూద్దాం అనుకుంటున్నాయి గాని, ఎక్కడా ఎలాంటి చప్పుడు వినిపించం లేదు.

సుబ్బారావుగారిది పెద్ద బంగాళా. గేటుముందు ఎవరూ లేరు. గేటులోంచి కొంత దూరం నడిస్తే లోపలికి వెళ్ళే పెద్ద ద్వారం కనిపిస్తుంది. బంగళా ముందు తోట, బంగాళా చుట్టూ వృక్షాలు. ఆ ప్రాంతం అంతా కీచురాళ్ళు గీపెడుతున్న శబ్దాలూ, గాలికి చెట్లు చేస్తున్న చప్పుడ్లూ వినిపిస్తున్నాయి. ఏ చప్పుడూ లేనప్పుడు ఎండుటాకులు గలగలమంటున్నాయి.

సుబ్బారావు బంగళా ఆధునికమైన పెద్ద భవనం. ఆ భవనంలో చాలా గదులున్నాయి. మేడ మీద వున్న మధ్య గది-ఆయనది. అంత పెద్దభవనంలోనూ ఆయన తప్ప ఇంకెవ్వరూ లేరు. కింద వున్న ఎనిమిది గదులు, మేడమీది ఆరు గదులూ అన్నీ ఖాళీగానే వున్నాయి. కిందా పైనా కిటికీ తలుపులు, గదుల తలుపులూ అన్నీ గడియలు వేసేసి, సుబ్బారావుగారు ఒక్కడూ తన గదిలో పడుకున్నాడు. ఆయన గాఢ నిద్రలో వున్నాడు. అది ఏర్ కండిషన్డ్ గది. సన్నగా వినవస్తున్న ఆ చప్పుడు, సుబ్బారావుగారు మధ్య మధ్య చేస్తున్న గురకధ్వనులూ తప్ప, మరే శబ్దమూ ఆ గదిలోకి ప్రవేశించడానికి అవకాశం లేదు. ఆయన ఆ గదిని అందంగా అమర్చుకొన్నాడు. గది నిండుగా తివాసీ, గది మధ్యలో పెద్ద మంచం, మంచం చుట్టూ అలమారలు, వాటి నిండా పుస్తకాలూ-పేర్చుకున్నాడు. ఒక మూల ఆడియో యంత్రాలు, మరో మూల వీడియో-ఏర్పాటు చేసుకొన్నాడు. ఒక్క స్విచ్ నొక్కితే, గదంతా పట్టపగల్లా చెయ్యగల పెద్దసైజు 'చాండ్లియర్' మంచానికి పైగా, శోభాయమానంగా కనిపించేలా పెట్టించుకున్నాడు.

ఆ రాత్రి పది గంటల ప్రాంతంలో సుబ్బారావుగారు సుష్టుగా భోజనం చేసి, కాస్సేపు పుస్తకం చదివి, దీపాలన్నీ ఆర్పేసి, నిద్రలోకి ఒరిగాడు.

గదిలో ఒక మూలవున్న 'నైట్‌లైట్' ప్రసరిస్తున్న చిన్న కాంతిలో సుబ్బారావు బట్టతల మెరుపు, తెల్లటి మీసాలు తెలుస్తున్నాయి.

ఉన్నట్టుండి పెద్ద గాలిదుమారం లేచింది. చెట్లకొమ్మలు పెద్దగా శబ్దం చేస్తూ భూమిని తాకుతున్నాయి. చెట్టూ చెట్టూ రాసుకుంటున్నాయి. గాలి మరింత ఉధృతమైంది. సుబ్బారావు గదిలోని కిటికీ తలుపులు దబదబా కొట్టుకుని, గడియలు ఊడగొట్టుకుని, దభీమని తెరచుకున్నాయి. లోపలికి దూకిన పెనుగాలికి పుస్తకాలు, వస్తువులూ ఎగిరి చెల్లాచెదురైనాయి. సుబ్బారావు కళ్ళు తెరచి చూసి, దిగ్గున లేచి కూచున్నాడు. గడియలు వేసిన కిటికీలు ఎలా తెరుచుకున్నాయా అని ఆశ్చర్య పడేంతలో, టెలిఫోన్ మోగింది. ఆ మోతకి ఆయన శరీరం జలదరించింది. ఇంత రాత్రివేళ, ఈ టెలిఫోన్ ఏమిటా అని, నెమ్మదిగా చెయ్యి చాచాడు. రింగ్ అవుతున్న ఫోన్ తీసి, 'హలో' అనే లోపల కరెంట్ ఫెయిలయింది! ఏసి ఆగిపోయింది! చిన్న దీపం ఆరిపోయింది! గదంతా చిమ్మ చీకటి; కిటికీలోంచి వస్తున్న గాలి హోరు. రిసీవర్ పక్కన పెట్టి సుబ్బారావు కిటికీలు మూసిరావడానికి లేవబోయాడు! ఆ కిటికీ చీకట్లో కనిపించక అక్కడ వున్న బల్ల తన్నేశాడు. బల్ల, బల్లమీద వున్న గ్లాసులు, వస్తువులూ శబ్దాలు చేస్తూ కిందపడిపోయాయి! లాభంలేదని, సుబ్బారావు టెలిఫోన్ తీసి, "హలో" అన్నాడు. "హలో" అంది అవతలి కంఠం. "హలో... సుబ్బారావుని. ఎవరూ" అని అరిచాడు సుబ్బారావు. "నేను సుబ్బారావుని" అంది అవతలి కంఠం. అది అచ్చం సుబ్బారావు కంఠమే; ఏమీ తేడా లేదు.

"...నువ్వు...సుబ్బారావువా... ఏ సుబ్బారావువి?" అని అడిగాడు సుబ్బారావు భయపడుతూ.

"నేనే. 'నువ్వు'నే. నీ అసలు రూపాన్నే."

"ఎక్కడ్నించి మాట్లాడుతున్నావు? ఎలా మాట్లాడుతున్నావు?"

"నేనొకచోట బంధించబడివున్నాను. నువ్వు వెంటనే బయల్దేరి వచ్చి, నన్ను విడిపించు!"

"నిన్ను నేను విడిపించడం ఏమిటి–నేనిక్కడే వుండగా, అక్కడ వున్నసంటావేమిటి—"

"అంతా చెప్తాను. వెంటనే బయల్దేరు."

"నేనా...ఇప్పుడా...నావల్ల కాదు."

"కాదు రావాలి. రాకపోతే చచ్చిపోతాను. నేను చచ్చిపోడం అంటే, నువ్వు చచ్చిపోతావు. ఆలస్యం చెయ్యకు. నిన్ను బతికించుకో. నేను నీకు దారి చెబుతాను. అలాగే బయల్దేరిరా."

"...చీ...క...టి..."

"టార్చిలైటు తీసుకో. ఆ లైటు వేసుకుంటూ గుమ్మాలన్నీ దాటి, నీ యింటి గేటు దాటి తిన్నగా వెళ్లు. నాలుగు కిలోమీటర్లు నడిచిన తర్వాత ఎడమవేపు చిన్న సందు వస్తుంది. ఆ సందులోంచి వెళ్తే సందు చివర పాడుబడిన భవనం కనిపిస్తుంది. ఆ భవనంలోకి రా. మొదట్లో కనిపించే పెద్ద ద్వారం ద్వారా ప్రవేశించు. లోపల ఎనిమిది గదులున్నాయి. వాటిలోకి వెళ్ళకు. ఎదురుగా పైకి మెట్లు కనిపిస్తాయి. ఆ మెట్లు ఎక్కితే మేడ మీదికి వస్తావు. అక్కడ ఆరు గదులున్నాయి. మధ్య గదిలోకి రా. పైన వరండాల నిండా మొక్కలు, గడ్డీ పెరిగి వుంటాయి. వాటి మధ్య నుంచి






నడుస్తూ రా. మధ్య గదిలోకి వచ్చి, మధ్యలో వున్న తుప్పుపట్టి రాలిపోతున్న ఇనపమంచం వేపు చూడు. ఆ మంచం మీదనే నేనున్నాను. ఇక్కడ తలుపులు, కిటికీలూ అన్నీ వేసేసి వున్నాయి. తలుపు బయట గడియలు వేసేసి వున్నాయి. నేను రాలేను. నువ్వు వచ్చి గడియలు తీసి లోపలికి రా. ఇద్దరం కలిసి వెళ్లిపోదాం.” అని చాలా వివరంగా చెప్పింది ఆ కంఠం. ఆ కంఠం, ఆ మాటతీరూ తనది కాదనడానికి ఏ అనుమానమూ లేదు. అంత స్పష్టంగా వున్నాయి! సుబ్బారావు ఫోన్ పట్టుకునే ఆలోచనలో పడ్డాడు.

“ఏమిటి ఆలోచిస్తున్నావు? ఫోన్ పెట్టేసి, వెంటనే బయల్దేరు... లేకపోతే నీ ప్రాణానికి ముప్పు! వూఁ!” అన్నాడు అవతలి సుబ్బారావు.

గాలిహోరు తీవ్రమైంది. సుబ్బారావు దభీమని ఫోన్ పడేసి, టార్చిలైటు కోసం వెతికాడు. అది, ఎప్పుడూ తన తల దగ్గరే వుంటుంది. కాని, ఇప్పుడు అది అక్కడ లేదు! మంచం కింద పడిపోయి వుంది. మొత్తానికి వెతికి, సుబ్బారావు టార్చిలైటు వెలిగించాడు.

కిటికీ తలుపులు దభీమని కొట్టుకుంటున్నాయి. వెయ్యాలంటే శ్రమగా వుంది. ఆలస్యమవుతోంది... తనను తాను రక్షించుకోవాలి! అన్నీ అలాగే వదిలేసి, తలుపు తీసుకుని బయల్దేరాడు.

గేటు దగ్గర కొచ్చేసరికి, చెట్ల కొమ్మలూ అవీ పడిపోయి కనిపించాయి. ఊరంతా చీకటిగానే వుంది. పైన ఆకాశం వున్నట్టే అనిపించలేదు. సుబ్బారావు తాళంతీసి, గేటు తెరిచాడు. లైటు వేసుకుంటూ తిన్నగా నడిచాడు... నడుస్తున్నాడు... ఆ సుబ్బారావు చెప్పిన సందు ఎడమవేపు కనిపించింది. అందులోకి తిరిగాడు... తిన్నగా నడిచాడు... పూర్తిగా శిథిలమైన భవనం కనిపించింది... అందులోకి ప్రవేశించాడు... అంతటా, చెట్లు, మొక్కలు, గడ్డి, ముళ్ళూ. టార్చిలైటు కాంతి వున్నా కూడా దారి ఎటో తెలియడంలేదు... గాలి ఉధృతమై భయంకరంగా అరుస్తోంది...

కొట్టుకుంటున్న గుండెను ఓ చేత్తో అదిమిపట్టుకొని, రెండో చేత్తో లైటు పట్టుకుని, సుబ్బారావు లోపలికి ప్రవేశించాడు... శీలగా మెట్లు కనిపిస్తున్నాయి... మెట్ల నిండా రాళ్లు, ముళ్లు... డొంకలు... కాలువేసి కిందికి దూరాడు... నిభాయించుకున్నాడు! నిదానంగా నెమ్మదిగా మెట్లు ఎక్కాడు... మేడ వరండాల నిండా కొమ్మలు, ఆకులూ పడివున్నాయి. ఎటు వెళ్లాలో దారి తెలియడంలేదు. దూరంగా ఏదో భయంకరమైన అరుపు వినిపించింది. సుబ్బారావు గుండె అదిరిపోయింది. అయినా భయపడకూడదు; తనను తాను బ్రతికించుకోవాలి! దార్లో అడ్డంగా వున్న వాటి మీద నుంచే. అలా అలా దాటుకుంటూ వెళ్లాడు. మధ్య గది దొరికింది. తలుపు కనిపించింది. అది బాగా తుప్పుపట్టిన ఇనప తలుపు. బయట పెద్ద గడియ వేసివుంది... సుబ్బారావు టార్చిలైటు చంకలో పెట్టుకుని, రెండు చేతులతోనూ గడియ తీశాడు; తలుపు తోశాడు; ఒక్క అంగలో గదిలో ప్రవేశించాడు. అతను గదిలోకి రావడం ఏమిటి — తలుపులు దభీమని మూసుకున్నాయి. బయట మళ్ళీ గడియపెట్టేసిన చప్పుడు వినిపించింది! సుబ్బారావుకి వణుకు పుట్టింది. అంతలోనే ధైర్యం తెచ్చుకొని, గది మధ్యలో వున్న మంచం మీదికి టార్చిలైటు వేశాడు- మంచం ఖాళీగా వుంది... అక్కడ ఎవరూ లేరు!!

“సుబ్బారావ్!” అని గట్టిగా అరిచాడు సుబ్బారావు— గది చుట్టూ లైటు కాంతిని తిప్పుతూ. లోపలంతా చిందరవందరగా. భయంకరంగా వుంది. మొక్కలు, చెట్లు, వాటి మధ్య శబ్దాలు చేస్తూ ఏవో జీవాలు! అతనికి మతిపోయింది. కాలూ చెయ్యి ఆడడం లేదు... అతను ఇక్కణ్ణుంచి బయట పడేదెలా? వణుకుతున్న చేత్తో టార్చి

లైటు కాంతిని అలా మరోసారి మంచం వైపు తిప్పాడు. పక్కనే టెలిఫోన్ కనిపించింది... అతని బుర్రలో మెరుపులాంటి ఆలోచన లేచింది.

గబాగబా వచ్చి టెలిఫోన్ నెంబరు తిప్పి, సుబ్బారావుకి ఫోన్ చేశాడు. అక్కడ రింగయింది. ఫోన్ ఎత్తిన శబ్దం అయింది. "హలో" అన్నాడు.

"హలో... సుబ్బారావుని.ఎవరూ?" అని వినిపించింది ఆవతల నుంచి. కచ్చితంగా అది అతని కంఠమే!!

"నేను సుబ్బారావుని."

"నువ్వు... నువ్వు... సుబ్బారావువా... ఏ సుబ్బారావువి?" అంది అపతలి కంఠం.

"నేనే. 'నువ్వు'నే. నే నొకచోట బంధింపబడి వున్నాను. నువ్వెంటనే బయల్దేరివచ్చి, నన్ను విడిపించు! నువ్వు రాకపోతే నేను చచ్చిపోతాను. నేను చచ్చిపోవడం అంటే, నువ్వు చచ్చిపోవడమే. ఆలస్యం చేయకు... బయల్దేరు!"




అక్కడ సుబ్బారావు బయల్దేరబోయేంతలో, కరెంటు ఫెయిలయింది; గాలిహోరు అధికమైంది; ఇక్కడి సుబ్బారావు చేతిలోని టార్చిలైటు ఆరిపోయింది.........!

*With best compliments from*

**GOLDEN PRESS**

**QUALITY OFFSET PRINTERS**

GOWLIGUDA, HYDERABAD-500 012.

Phone : 43702 (4 Lines)